క్లుప్తంగా

బాధ్యతగా పనిచేయాలి



వీఏఏలతో సమీక్షిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: అగ్రికల్చర్ అసిస్టెంట్లు బాధ్యతగా పని చేయాలని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీ కృష్ణ సూచించారు. మండలంలోని అంబకండి రైతుభరోసా కేంద్రంలో మండలంలో పలు గ్రామాలకు చెందిన వీఏఏలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో రైతులు చేయాల్సిన పనులపై ఇప్పటి నుంచే అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి దుక్కులు, పాడి దుక్కులు, ఇంకుడు గుంతలు తవ్వడం వంటి పనులు చేయించాలని తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



విద్యార్థులకు సూచనలిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణరావు

సంతకవిటి: మండలంలోని హంజరాం జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో ఉత్సాహవంతులైన విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణరావు దసరా సెలవుల్లో క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి 8 వరకు కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తిగల వారు 72888 07763 నంబర్‌ను సంప్రదించాలని లక్ష్మణరావు కోరారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం



తారకరామా కాలనీలో దసరా సంబరాలు

బొబ్బిలి: పట్టణంలోని తారకరామా కాలనీలో దసరా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు, విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం నాయకుడు వీఎస్ శర్మ, సమరసతా ఫౌండేషన్ డివిజన్ ధర్మప్రచారకులు ధూపం వాసు తదితరుల ఆధ్వర్యంలో విద్యార్థులు పులి మాస్కులను ధరించి ఆనందంగా కేరింతలు కొట్టారు.

కొమెరలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

రేగిడి: మండలంలోని కొమెరలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి జగదాంబ ఆధ్వర్యంలో కార్మికులు మురుగు కాలువల్లో పూడికలు తొలగించారు. తీసిన పూడికలు, చెత్తాచెదారాలను డంపింగ్ యార్డులకు తరలించారు.

ఆశాజనకంగా పత్తిపంట



అమరాం వద్ద పూత దశలో పత్తిపంట

రాజాం: మండలంలోని అంతకాపల్లి, అమరాం, ఆగూరు, గడిముడిదాం, తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న పత్తి పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం ఈ పంట తొలిదశ పూతకు చేరుకుందని వ్యవసాయశాఖ ఏఓ రేణుకా సాయి తెలిపారు. పత్తి పంట నాలుగు నుంచి ఆరు పర్యాయాలు పూతకు వస్తుందని, ఈ ఏడాది మండలంలో 274 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని చెప్పారు. అనుకూల వాతావరణం ఉండడంతో ఎకరాకు తొలి దశలో ఖర్చులు పోనూ రూ. 20 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. రైతులు సాగుచేస్తున్న ఈ మొత్తం పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

ఉత్తరాంధ్రుల ఆకాంక్ష నెరవేరాలి

బొబ్బిలి: పరిపాలనా రాజధానిగా విశాఖపట్నం త్వరగా ఏర్పాటు కావాలని రైతుసంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అన్ని రకాలుగా వెనుకబడి ఉందని, దీనిని అధిగమించి ప్రగతి పథంలో వెళ్లేందుకు విశాఖపట్నం రాజధానిగా ఉండాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర జిల్లాల యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ముఖ్యమంత్రి విశాఖపట్నాన్ని రాజధానిగా ఏర్పాటు చేస్తున్నారనే విషయం తెలిసిన వెంటనే ఈ ప్రాంత ప్రజలు ఎంతో సంబరపడుతున్నారన్నారు. .

ధర్మాన్ని అనుసరించాలి

రేగిడి: ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడాలని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు సాయిమురళీ మాస్టర్ అన్నారు. శనివారం స్థానిక విశ్వసాయి మందిరంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడవాలని, సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. అనంతరం మురళీ మాస్టర్‌ను సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, లావేటి విష్ణు ఘనంగా సత్కరించారు.

పల్లె ప్రగతికి బాటలు

- నియోజకవర్గంలో రూ.184.2 కోట్లతో పలు గ్రామాలకు బీటీ రోడ్లు
- దశాబ్దాలుగా ఉన్న రహదారి కష్టాలకు మోక్షం



గొల్లలపేట, జోగిందొరవలస మీదుగా కర్రిందొరవలసకు నిర్మించిన బీటీ రోడ్డు

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తోంది. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రతీ పంచాయతీలో అభివృద్ధి పనులు చేపడుతోంది. సీసీరోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వీధిదీపాలు, తాగునీటి కుళాయిల ఏర్పాటు ఇలా ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. గత ప్రభుత్వం పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి శిలాఫలకాలు వేసి వదిలేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం వాటిని పూర్తిచేయడంతో పాటు మారుమూల గ్రామాలను కలుపుతూ రహదారులను నిర్మిస్తోంది. నియోజకవర్గంలో ఉపాధిహామీ నిధులు రూ.82.68 కోట్లతో సుమారు 95.62 కిలోమీటర్లు, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులు రూ.16.15 కోట్లతో 38.15 కిలోమీటర్లు, ఏపీఆర్ఆర్‌పీ నిధులు రూ.73.07 కోట్లతో 62.40 కిలోమీటర్లు, ఏఎంసీ నిధులు రూ.12.30 కోట్లతో 50.17 కిలోమీటర్లు చొప్పున మొత్తంగా రూ.184.20 కోట్లతో సుమారు 246.34 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించారు. దశాబ్దాలుగా రహదారి సౌకర్యానికి నోచుకోని గ్రామాలకు రోడ్లు నిర్మించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



కొట్టక్కి జంక్షన్ నుంచి జన్నివలస మీదుగా గిరిజన గ్రామాలకు నిర్మించిన తారురోడ్డు

రోడ్డు వేస్తారనుకోలేదు..



మా గ్రామానికి మట్టిరోడ్డు ఉండేది. వర్షం పడితే బురదమయంగా తయారయ్యేది. రాకపోకలకు నానా అవస్థలు పడేవాళ్లం. రోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు కోరినా గత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చొరవతో గొల్లపేట నుంచి జోగిందొరవలస మీదుగా కారెందొరవలస గ్రామం వరకు సుమారు రూ.2 కోట్లతో 3.1 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మించారు.

– డి.కృష్ణ, జోగిందోరవలస

అవస్థలు తీరాయి..



కొట్టక్కి జంక్షన్ నుంచి జన్నివలస పంచాయతీ పరిధిలోని జన్నివలసతో పాటు మెట్టవలస, బొడారపువలస, నేరళ్లవలస, చిన నేరళ్లవలస, తంగిన గుడ్డివలస, జాకరమ్మ కొత్తవలస తదితర గ్రామాలను కలుపుతూ రూ.4 కోట్లు అంచనా వ్యయంతో శాశ్వతంగా తారు రోడ్డు నిర్మించారు. దీంతో ఏళ్లుగా పడిన అవస్థలు తీరాయి. రాకపోకలు సులభతరమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

– సారంగదొర, సర్పంచ్, జన్నివలస

ఆక్రమణలపై విచారణ



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది

బొబ్బిలి: ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి విచారణ చేస్తున్నారు. కాలనీలో ప్రతీ ఇంటికి వెళ్లి వారి ఆధార్‌కార్డు, ఇళ్ల పట్టాలను పరిశీలిస్తున్నారు. రెండూ సక్రమంగా లేనట్లయితే ఆయా స్థలాలను ప్రభుత్వ స్థలాలుగా గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది శనివారం పరిశీలించారు. ఆయా స్థలాలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన పట్టాలు, ఇతర ఏవిధమైన హక్కు పత్రాలైనా ఉండే వాటిని తహసీల్దార్ కార్యాలయంలో చూపించిన హక్కుదారులుగా నిర్ధారించుకోవచ్చని సూచించారు.

సంతాపం..



ఇనుమల భాస్కరరావు (ఫైల్)

సంతకవిటి: మండలంలోని ఎస్.రంగారాయపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్‌ఓ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇనుమల భాస్కరరావు (68) మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. శుక్రవారం గుండెపోటుతో ఆయన మృతి చెందగా.. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీకాకుళం జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, సంతకవిటి మాజీ ఎంపీపీ కొల్ల అప్పలనాయుడు తదితరులతో పాటు పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, ఆయన అభిమానులు ఎస్.రంగారాయపురం గ్రామానికి చేరుకుని భాస్కరరావు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. మృతుడి భార్య కృష్ణవేణి ఎస్.రంగారాయపురం పంచాయతీ సర్పంచ్‌గా, ఆయన సోదరుడు మురళీకృష్ణ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం రేపు

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలో ఈ నెల 16న నిర్వహించే 'వై ఏపీ నీడ్స్ జగన్' మండల స్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు నర్సుపల్లి బాబ్జీరావు కోరారు. సభ ఏర్పాటుకు శనివారం స్థల పరిశీలన చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 10గంటలకు స్థానిక రామకృష్ణ థియేటర్ వద్ద సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరవుతారని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీకి నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, పీఏసీఎస్ అధ్యక్షులు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఆకుకూరలకు కేరాఫ్ రామభద్రపురం



మార్కెట్‌లో విక్రయించేందుకు ఆకుకూరలు తీసుకెళ్తున్న రైతులు

రామభద్రపురం: ఆకుకూరల సాగుకు రామభద్రపురం కేరాఫ్‌గా మారింది. తక్కువ వ్యవధిలోనే పంట చేతికందుతుండటం.. నీటి వసతి ఎక్కువగా అవసరం లేకపోవడంతో రైతులు ఆకుకూరల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. పంచాయతీలో సుమారు 700 వరకు కూరాకుల కులస్తుల కుటుంబాలు ఉన్నాయి. వీరంతా పూర్వికుల నుంచి కూరగాయల సాగే జీవనాధారంగా చేసుకుని వస్తున్నారు. తొటకూర, పాలకూర, మెంతాకు, గోంగూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీన తదితర ఆకుకూరలను సాగుచేస్తూ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో విక్రయిస్తూ, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఆర్బీకే



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఆర్‌బీకే

మెంటాడ: మండలంలోని కై లాం గ్రామంలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం ప్రారంభానికి సిద్ధం చేసినట్లు సర్పంచ్ గండి శ్యామలాదేవి శనివారం తెలిపారు. గిరిజనశాఖ మంత్రి పీడిక రాజన్నదొర చేతులమీదుగా ఈ నెలాఖరులో ఆర్‌బీకేని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు రైతులకు చేరువైనట్లు చెప్పారు.

సారాతో అనర్థాలెన్నో..



తమరాంలో పరివర్తన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎస్ఈబీ సీఐ, తదితరులు

సంతకవిటి : సారా తాగడం వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్, ఎస్సై పిచ్చేశ్వరరావు అన్నారు. మండలంలోని తమరాంలో శనివారం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సారా తాగడం వల్ల యువత చెడుమార్గం పట్టే అవకాశం ఉందన్నారు. యువత బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ ఆడంగి లక్ష్మి, ఆడంగి గౌరునాయుడు, తవిటినాయుడు, పాల్గొనరావు, భాస్కరరావు, సూరప్పనాయుడు, కూన భాష్కరరావు, కృష్ణ, ఎస్ఈబీ పోలీసులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ

బొబ్బిలి: పట్టణంలోని స్కూళ్లు, కళాశాలల్లో సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలకు వెళ్లి ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు తరగతులను నిలిపివేశారు. విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ ఒత్తిడితో కూడిన పాఠ్యాంశాల బోధన ఎంత వరకూ సమంజసమని జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ ప్రశ్నించారు. వెంటనే ఆయా విద్యాసంస్థలు తరగతులను నిలిపివేసి విద్యార్థులను పంపివేశారు.

తెగుళ్లపై అప్రమత్తం



తెగుళ్లు సోకే పంటను పరిశీలిస్తున్న ఏఓ కన్నబాబు

వంగర: వరి పంటకు ఆశిస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ తట్టికోట కన్నబాబు సూచించారు. మండల పరిధిలోని జగన్నాథవలసలో వరిపంట పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటకు సోకే వ్యాధులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. దోమపోటు సోకే పంటకు మోనోక్రోటోఫాస్ 350 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 400 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పాముపొడ తెగులు, కాండంకుళ్లు తెగులు సోకే పంటలకు హెక్సాకొనజోల్ 400 మిల్లీలీటర్లు లేదా వేలిడామైసిన్ 400 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పంటకు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మజ, రైతులు పాల్గొన్నారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

రాజాం సిటీ: మండల పరిధి గెద్దవలస ఇద్దరి నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ ఎస్సై ఎస్. పిచ్చేశ్వరరావు తెలిపారు. శనివారం తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించగా.. కందుల జనార్దనరావు నుంచి 8.. బూరాడ సీతారాం నుంచి ఏడు మద్యం సీసాలు పట్టుబడ్డాయన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



గుళ్లపాడులో పేడ గత్తంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న రమాదేవి

రేగిడి: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ రమాదేవి అన్నారు. మండల పరిధిలోని గుళ్లపాడు క్లస్టర్ పరిధిలో ఉన్న వండానపేట, కేఎం వలస రైతులతో ప్రకతి వ్యవసాయంపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు ఎక్కువగా రసాయన ఎరువులు వినియోగిస్తుంటారని, దీని వల్ల పైర్లకు తెగుళ్లు ఆశిస్తాయన్నారు. సేంద్రియ ఎరువులైన పేడ గత్తం, గొర్రె గత్తం వంటివి వినియోగించడం వల్ల భూసారం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌డీఏ జె.అప్పలనాయుడు, ఐసీపీ కె. పార్వతి పాల్గొన్నారు.

పురుగు మందుకు బదులు గడ్డిమందు పిచికారీ

- రెండెకరాల్లో వరిపంట నష్టం



నష్టపోయిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బాడంగి: వరిపొలానికి పురుగు మందుకు బదులు గడ్డి మందును పిచికారీ చేయడంతో ఓ రైతు రెండెకరాల విస్తీర్ణంలో పంట నష్టపోయాడు. ఈ సంఘటనకు సంబంధించి బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పి.వెంకంపేటకు చెందిన రైతు అల్లు చిన్నంనాయుడు అదే గ్రామానికి చెందిన భూస్వామి వద్ద రెండెకరాలను కౌలుకు తీసుకొని వరిపంట సాగు చేస్తున్నాడు. పంట పొట్టదశకు చేరుకోవడంతో తెగుళ్లు సోకకుండా ముందస్తుగా పురుగు మందు పిచికారీ చేయాలని భావించి బొబ్బిలి వెళ్లి పురుగు మందు, గడ్డి మందు డబ్బాలను కొనుగోలు చేసి ఒక బ్యాగులో ఇంటికి తెచ్చాడు. చదువురాకపోవడంతో పురుగు మందుకు బదులు గడ్డి మందును వరిపంటకు పిచికారీ చేశాడు. మరుసటి రోజు పంటను చూసేందుకు పొలానికి వెళ్లగా పంట మొత్తం వడలిపోయి ఉండటం గమనించి జరిగిన పొరపాటును గ్రహించి బోరున విలపించాడు. పంట సాగుకు ఇప్పటివరకు సుమారు 40 వేలు వరకు పెట్టుబడి పెట్టినట్లు చెప్పాడు. ఏఈఓ పుష్పలత, వీఏఏ సాయికుమార్ పంటను పరిశీలించి జరిగిన విషయాన్ని ఏఓ శిరీషకు వివరించారు. ఈ సంఘటనను వ్యవసాయశాఖ ఏడీ దృష్టికి తీసుకువెళ్తానని, రైతుకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామన్నారు.

మల్లంపేటలో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న స్థానిక ప్రజా ప్రతినిధులు

బొబ్బిలి: ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మల్లంపేటలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై స్థానికులతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, కొప్పల వెలమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో ఏళ్ల తరబడి ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో స్థానికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు చొరవతో మల్లంపేటలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. స్మశానవాటికను అభివృద్ధి చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారితో పాటు ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి, మున్సిపల్ కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, రామారావు, పోల చినవెంకటరమణ, కొప్పలవెలమ సంఘ రాష్ట్ర కార్యదర్శి పోల జగన్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



రాజాం : దసరా ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయ 34వ వార్షికోత్సవ, దసరా ఉత్సవాల పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 15 నుంచి 24 వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ పి.శ్యామలరావు, ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, కూరాడ వెంకటరావు, దాసరి అప్పారావు, ఆలయ అర్చకులు ఆర్. శ్రీనివాసరావుశర్మ, వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ మేనేజర్ బీవీ మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు



పోలిపల్లి పైడితల్లి

రాజాం: పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం నుంచి వారం రోజుల పాటు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో సనాతన హిందూ ధర్మ పరిరక్షణతో పాటు హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా వీటిని నిర్వహించనున్నట్లు ఈఓ బీవీ మాధవరావు శనివారం వెల్లడించారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి 8 వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రవచనాలు, సంత్సంగాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ తెలిపారు. వారం రోజుల పాటు పైడితల్లికి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శరవేగంగా అండర్ డ్రైనేజీ నిర్మాణం



జీఎంఆర్ఐటీ రోడ్డులో నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ

రాజాం: రాజాం ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా జరుగుతున్న పనుల్లో రోడ్డుకు ఇరువైపులా అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నారు. రూ. 20 కోట్ల భారీ వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డును విస్తరించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా మూడు అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల లోతులో అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ పనులు చివరి దశకు వచ్చాయి. అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ వీటి నిర్మాణం పూర్తి కావొచ్చింది. మరోవైపు చీపురుపల్లి రోడ్డులో గాయత్రికాలనీ వరకు కాలువలు నిర్మించారు. మధ్యలో కల్వర్టుల నిర్మాణం పూర్తి చేసి బీటీ రోడ్డును 80 అడుగుల మేర నిర్మించనున్నామని ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు తెలిపారు.

జగనన్న పాలనలో సర్వతోముఖాభి వృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు, తదతరులు

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తున్నారని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కార్యక్రమాలు చేసినా, అలజడులు సృష్టించినా, రాద్ధాంతాలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ మళ్లీ జగన్‌ను సీఎంను చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో నిర్వహించనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులంతా ప్రజల్లోకి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించనున్నట్లు చెప్పారు. సమావేశంలో పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎన్ రాయులు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, డర్రు పైడిరాజు ఉన్నారు.